మూడు దెయ్యాలు

ప్రతాప రవిశంకర్

రాత్రి ఎనిమిది గంటలు దాటుతోంది.

రోడ్డుమీద గబగబా నడుస్తున్నాడు రాజు. రద్దీగా వుంది రోడ్డు. ఎదురొస్తున్న మనుషులను తప్పుకుంటూ నడుస్తున్నాడు.

షాపుల్లో దీపాలు ప్రకాశవంతంగా వెలుగుతున్నాయి. అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. పేవ్‌మెంటుమీద నిలబడి ఎవడో పెద్దగా అరుస్తున్నాడు లాటరీ టిక్కెట్లు కొనండని. కొంతమంది వాడి అరుపులు విని వాడి దగ్గరకు వెళ్ళి డ్రా తేదీ ఎప్పుడో కనుక్కొని టిక్కెట్లు కొంటున్నారు.

రాజుకూడా వాడి అరుపులు విన్నాడు. ఎందుకో తన అదృష్టాన్ని పరిశీలించుకోవాలని అనిపించింది. అవును. ఇంతవరకు తను ఒక్క లాటరీ టిక్కెట్టుకూడా కొనలేదు.

తన అదృష్టం ఎలా వున్నదో? ఒక్క లాటరీ టిక్కెట్టు కొంటే....

అరుస్తున్నవాడిని దాటిపోయాడు. అయినా లాటరీ గురించిన ఆలోచనలు రాజును వదల్లేదు. ఠక్కున ఆగి పోయాడు.

వెనక్కి తిరిగి వాడి దగ్గరగా నడిచాడు....

ఇద్దరు నిలబడి వాడిదగ్గర టిక్కెట్లు కొంటున్నారు.

రెండు రూపాయలిచ్చి ఓ టిక్కెట్టు కొన్నాడు.

లక్ కలిసొస్తే తనకు నాలుగు లక్షలొస్తాయి. అప్పుడు తను ఉద్యోగంకోసం వెతుక్కోవలసిన అవసరంలేదు. తనే ఓ ఇండస్ట్రీ పెట్టి ఎంతోమందికి ఉద్యోగాలిస్తాడు.

ఇంతకీ తన అదృష్టం ఎలా వుందో?

అక్కడినించి కదిలాడు. అదృష్టం గురించిన ఆలోచ నలు రాజును చుట్టుముట్టాయి.

మెయిన్ రోడ్డును దాటి చిన్నరోడ్డులోకి ప్రవేశించాడు. ఆ రోడ్డు చివరకు వెళ్ళి ఇంకో మలుపు తిరిగితే అతని గది వస్తుంది. ఆ గదిలో అతనూ అతని స్నేహితుడు రంగా రావు వుంటున్నారు.

రోడ్డుమీద నడుస్తూనే షర్టు జేబులోనించి సిగరెట్టు ప్యాక్ బయటకు తీశాడు రాజు.

ఓ సిగరెట్టు వెలిగించాడు....

పొగవదులుతూ నడుస్తున్నాడు.

అక్కడినించి వీధిదీపాలు వెలగడంలేదు. చలికాలం కావడంవల్ల అప్పటికే ఇళ్ళలో మనుషులు తలుపులు బిగించుకున్నారు.

మసక వెలుతురు రోడ్డును ఆక్రమించుకుంది.

అతని పెదవులమధ్య సిగరెట్టు ఎర్రగా వెలుగుతోంది.

కొంచెం దూరంలోవున్న రైలు స్టేషన్లో ఏదో రైలు పెద్దగా కూతపెడుతోంది.

నడుస్తున్న రాజు గబుక్కున ఆగిపోయాడు.

"వదలండి....వదలండి" ఎవరో ఆడది చిన్నగా అరుస్తోంది.

చుట్టూ చూశాడు.

రోడ్డు పక్కనే యెత్తయిన గోడవారగా ముగ్గురు మగాళ్ళమధ్య ఓ ఆడది గింజుకుంటోంది.

వాళ్ళు ఆ అమ్మాయిని హింసిస్తున్నారు. కొంచెం కూడా ఆలోచించలేదు రాజు.

రివ్వున పరుగెత్తి వాళ్ళమీద దూకాడు. ముగ్గురూ ఒక్కసారి ఉలిక్కిపడ్డారు.

ఆ అమ్మాయిని వదిలేశారు.

ఆమెకు కొంచెం దూరంలో కాలేజ్ బుక్స్ పడున్నాయి. బహుశా ట్యూషన్‌నుంచి వస్తుందేమో ఆ అమ్మాయి. ఒకడిని డొక్కలో తన్నాడు రాజు.

పెద్దగా కేకపెట్టాడు వాడు. వెనక్కు పడిపోయేడు. మిగిలిన ఇద్దరూ అతనిమీదకు కలియబడ్డారు. గుండెల మీద పిడికిళ్ళతో పొడిచారు. విరుచుకు పడ్డాడు రాజు. ఎవడో రాజు మొహంమీద బలంగా కొట్టాడు. అదిరి పడ్డాడు రాజు. కళ్ళు తిరిగాయి.

ఒకడు రాజు గుండెలమీద కూర్చున్నాడు. మరొకడు చేతులను గట్టిగా మెలితిప్పాడు.

కీచుమంటూ అరిచాడు రాజు.

"పెద్ద హీరోలా దాన్ని రక్షించడానికి వచ్చావురా?" రాజు అరుస్తున్నాడు బాధతో.

రోడ్డు నిర్మానుష్యంగా వుంది. చీకటి పడితే సాధారణంగా ఎవ్వరూ ఆ రోడ్డున రారు. తొందరగా ఇంటికి

చేరాలనుకునేవారు ధయిర్యంచేసి ఆ రోడ్డున వస్తారు. స్టేషన్ అవతలకు అది దగ్గరిదారి. ఎవడో జేబులోనించి పెన్‌టార్చి బయటకు తీశాడు. రాజు మొహంమీద ఫోకస్ చేశాడు.

అతని ముఖం బాధతో మెలితిరుగుతోంది.

“చస్తాడ్రా” యెవడో అన్నాడు.

“చావనీ” మరొకడు చిన్నగా అన్నాడు.

దూరంనుంచి పడుతున్న మసక వెలుగులో వాళ్ళ ముఖాలు చూశాడు రాజు.

ఇంతకుముందు యెక్కడో చూసినట్టుగానే అనిపించాయి. కిరాతకుల్లా వున్నారు.

తనని చంపుతారేమో? వాళ్ళని ఎదిరించాలని వుంది. కాని తన బలం చాలటంలేదు.

వాళ్ళను గట్టిగా నెట్టబోయాడు. అంతే.అతని గుండెల మీద, మొహంమీద బలంగా దెబ్బలు పడ్డాయి.,

కేకలు పెడుతున్నాడు రాజు.

నోట్లోంచి నెత్తురు కారుతోంది.

వాళ్ళ ముగ్గురూ నిలబడ్డారు. ఒక్కసారి చుట్టూరా చూశారు.

“ఏదిరా ఇది?” ఎవడో అన్నాడు. అప్పటివరకూ వాళ్ళు ఆ అమ్మాయిని గురించి మరచిపోయారు.

“పిట్ట ఎగిరిపోయిందిరా?”

“ఎక్కడికి పోతుంది? రేపు దొరుకుతుందిలే పదండి.”

వాళ్ళు వెళ్ళిపోయారు.

రాజు మూలుగుతున్నాడు. నెత్తురు గొంతుమీద కారుతోంది.

‘ఎవరయినా వస్తే బావుండు’ అనుకున్నాడు.

గోడ్డుమీదనుంచి ఏవో కారు పోసుకుపోయింది. రాజు వాళ్ళకు కనిపించలేదు రోడ్డుపక్కగా పడివుండటంవల్ల.

"దాహం.... దాహం...." అరుస్తున్నాడు రాజు. అతనికి యెలాగో లేవాలని వుంది. ప్రయత్నం చేశాడు. కాని కాళ్ళు కదల్లేదు. చేతులుకూడా కదల్లేదు.

రాజుకి స్పృహ పోయింది.

2

కళ్ళు తెరిచాడు రాజు.

పైన ఫ్యాను గిరగిరా తిరుగుతోంది. గోడనున్న ట్యూబు లైటు వెలుతురును విరజిమ్ముతోంది. వెంటనే వెలుగును చూడలేకపోయాడు. ఒక్కసారి కళ్ళుమూసుకొని మళ్ళీ తెరిచాడు కళ్ళని.

ఇప్పుడు రాజుకు పక్కనే కూర్చున్న మనుషులు కనిపించారు.

'థాంక్ గాడ్' అన్నాడు పక్కనే కూర్చున్న లావుపాటి ఆయన. ఆయనకు ఏభై ఏళ్లున్నాయి. బట్టతల. ఫుల్ షర్టు వేసుకున్నాడు. కళ్ళకు పలుచని అద్దాలు.

"మీరెవరు?" అన్నాడు రాజు చిన్నగా.

"ఈ అమ్మాయి తండ్రిని" నవ్వుతూ అన్నాడాయన.

"ఈ అమ్మాయి...." అంటూ ఆగిపోయాడు రాజు. జరిగినదంతా అతనికి లీలగా గుర్తుకొచ్చింది.

"చాలా థాంక్సండీ. నా గురించే మీరు యిలా అయ్యారు" అన్నదా అమ్మాయి కృతజ్ఞతగా.

"ఫర్వాలేదు. నేను బతుకుతాననుకోలేదు. అయినా నన్ను ఇక్కడికి యెవరు తీసుకొచ్చారు?" అడిగాడు రాజు.

"నేనే" అన్నదా అమ్మాయి.

ఆయన రాజు ముఖంలోకి పరీక్షగా చూస్తున్నాడు.

"మీరా! మీరు అక్కణ్నించి వెళ్ళిపోలేదా?"

"వెళ్ళాను. వాళ్ళు ముగ్గురు. మీరు ఒక్కరు. ఎలా గయినా మీకు దెబ్బలు తగులుతాయని నాకు తెలుసు. అందుకే వెంటనే మా నాన్నని తీసుకొని వచ్చాను. నేను అనుకున్నట్టుగానే మీరు స్పృహలేకుండా వున్నారు."

"మెనీ థాంక్స్" అన్నాడు రాజు.

"నేనే మీకు థాంక్స్ చెప్పుకోవాలి. నాకోసం మీ రింతటి ప్రమాదాన్ని యెదుర్కొన్నప్పుడు ఈ మాత్రం చెయ్యడంలో గొప్పలేదు" అన్నదా అమ్మాయి.

ఇంతలోనే డాక్టరు వచ్చాడు.

"గుడ్.... తెలివొచ్చిందన్నమాట. ఏమోయ్ హీరో. తెలుగు సినిమాలు ఎక్కువగా చూస్తావా?" అన్నాడు డాక్టర్ నవ్వుతూ.

రాజు బలహీనంగా నవ్వాడు.

"నీ పేరేమిటి?" అడిగాడాయన.

"రాజు."

"ఒకరోజంతా నువ్వు రెస్టు తీసుకోవాలబ్బాయ్," అన్నాడు డాక్టర్.

"అలాగే సార్. నేను నా గదికి వెళతాను."

"ఎక్కడ నీ గది?"

చెప్పాడు రాజు.

"అయితే ఇక్కడకు దగ్గరే. ఒక్కరోజు యిక్కడ వుండలేవా?"

"సారీ సార్ ఆటోలో వెళ్ళగలను."

"నీ యిష్టం" అన్నాడు డాక్టర్.

"నువ్వేం చేస్తున్నావ్?" అడిగాడాయన.

"నిరుద్యోగిని సార్. ఇంకా పెళ్ళికాలేదు. పెళ్ళయి

నట్లయితే ఇంత ధైర్యంగా వాళ్ళతో తలపడే వాడిని కాదు."

"గుడ్ జోక్" పెద్దగా నవ్వాడాయన. ఆ అమ్మాయి చిన్నగా నవ్వింది.

"నా పేరు శివపాదం. ఓ ప్రయివేటు ఫర్మ్‌కి మేనేజర్‌గా చేస్తున్నాను. ఈ అమ్మాయి నా కూతురు కస్తూరి" పరిచయం చేశాడు.

"ఏం చదువుతోంది?" అడిగాడు రాజు.

"బియ్యే సెకండియర్."

"డాక్టర్. ఇక నే వెళతాను." బెడ్ మీదనుంచి మెల్లగా లేచాడు రాజు.

ఆయన జేబులోనించి యాభైరూపాయల నోటు బయటకు తీశాడు.

"ఇదిగో అబ్బాయ్....ఈ డబ్బు వుంచు."

"నేను మీ అమ్మాయికి అంగరక్షకుడిని కాదు. సమయానికి అటువైపు వచ్చాను కాబట్టి ఇలా జరిగింది."

"ఫర్వాలేదులే వుంచు."

రాజు ఆ డబ్బులు తీసుకోలేదు.

అందరికీ వెళ్ళొస్తానని చెప్పి, నీరసంగా బయటకు నడిచాడు.

3

"వాళ్ళెలా వుంటారు?" అడిగాడు రంగారావు సిగరెట్టు వెలిగించి.

"దారుణమయిన మొహాలు. జేబులుకొట్టే వాళ్ళలా వున్నారు. ఇద్దరు మన హయిట్ వుంటారు. ఒకడు బాగా పొట్టి. చెనావాడిలా వున్నాడు" చెప్పాడు రాజు.

"ఇంతకుముందు యెప్పుడయినా చూశావా?"

"నాకు వాళ్ళను చూడగానే పరిచయమున్న మనుషులు లాగానే అనిపించారు. కాని యెక్కడ చూశామో గుర్తురావడం లేదు."

"ఏ సెంటర్లో చూసివుంటాం?"

"ఏమో! గుర్తు రావడంలేదు."

"ఒకపని చేద్దాం."

"ఏమిటి?"

"సాయంత్రం చీకటిపడిన తర్వాత మనకు తెలిసిన సెంటరులన్నింటికీ వెడదాం. ఎక్కడో ఒకచోట దొరకక పోరు" అన్నాడు రంగారావు.

సరేనన్నాడు రాజు. అతనికి బాగా కసిగావుంది వాళ్ల మీద. ఇంతకుముందు యెవ్వరూ రాజుమీద చెయ్యి చేసుకోలేదు. ఇదే మొదటిసారి తన్నులు తినడం. అవమానంగా వుంది.

రంగారావు టేబిల్ సొరుగులోనించి బటన్ నైఫ్ బయటకి తీశాడు.

"కత్తి దేనికి?" అన్నాడు రాజు.

"ప్రాణ రక్షణకోసం. వీలు దొరికితే పొడిచేస్తాను" అన్నాడు రంగారావు.

రంగారావుకు పౌరుషం ఎక్కువ. తన ప్రాణమిత్రుడు అయిన రాజును తన్నినవాళ్ళమీద అతను పగబట్టాడు. రంగారావుది పాము పగకంటే యెక్కువ. అతను బదులు తీర్చుకునేవరకు నిద్రపోడు. అతనిది చిన్నతనం నుండి డేరింగ్ నేచర్. ఎప్పుడూ తగాదాల్లో తిరుగుతూండేవాడు.

రంగారావు దృఢంగా వుంటాడు. వ్యాయామం చేసిన శరీరం. లావుగా, పొడుగ్గా వుంటాడు.

సాయంత్రం అయిదయింది.

రాజు కొంచెం కోలుకున్నాడు.

గదిలోనించి సైకిలు బయటకు తీశాడు రంగారావు.

తాళం పెట్టాడు రాజు గదికి.

ఇద్దరూ సైకిలుమీద బయలదేరారు.

రంగారావు సైకిలు తొక్కుతున్నాడు.

రాజు వెనుక కూర్చున్నాడు.

రౌడీలు కలుసుకునే సెంటర్లన్నింటికీ తిరుగుతున్నారు ఇద్దరూ....

ఎక్కడా వాళ్ళు కనిపించలేదు.

అప్పటికి రాత్రి ఏడున్నరయింది.

వెనక్కు మళ్ళారు.

"రేపయినా దొరక్కపోరు" అన్నాడు రంగారావు.

"అవును" అన్నాడు రాజు.

ఆ రోడ్డు అంతగా జనంతో నిండిలేదు. పలుచగా వుంది. రంగారావు, రాజు సిగరెట్టు తాగుతూ ఆ ముగ్గురి గురించే మాట్లాడుకుంటూ వస్తున్నారు. కూనిరాగాలు తీస్తూ యెవడో రోడ్డుమీద తూలుకుంటూ నడుస్తున్నాడు. ఏదో హిందీ సినిమాలో పాట.

అతను బాగా తాగినట్టున్నాడు. అడుగులు తడబడుతున్నాయి.

నవ్వుకున్నాడు రంగారావు. తాగినవాడు పాటలు రాకపోయినా ఏదో ఒకటి పాడుతాడు.

సైకిలు వాడిని దాటిపోయింది.

సిగరెట్టు విసిరేసి వెనక్కు తిరిగి వాడిని చూశాడు రాజు.

"సైకిలు ఆపు రంగా" అన్నాడు వెంటనే.

ఆపాడు రంగారావు.

ఇద్దరూ సైకిలు దిగారు.

వాడు వాళ్ళదగ్గరకు వచ్చాడు.

"దొరికాడు రంగా....ఆ ముగ్గురిలో వీడొకడు" సంతోషంగా అన్నాడు రాజు.

"సరిగ్గా చూడు" అన్నాడు రంగారావు.

"అనుమానం లేదు రంగా. నా గుండెలమీద మోచేతులతో పొడిచాడు" అన్నాడు రాజు.

వాళ్ళిద్దరి మాటలూ విన్నాడు వాడు.

ఒక్క నిమిషం రాజుకేసి చూసి వెంటనే గుర్తుపట్టాడు. "ఒరేయ్ నువ్వు బతికే వున్నావా?" అన్నాడు తూలుతూ.

"అవును చూడు." అంటూ రాజు వాడి గుండెలమీద యెగిరి తన్నాడు.

వాడు వెల్లకితలా పడిపోయాడు పెద్దగా అరిచి.

"నువ్వు చూసుకో ముందు. తర్వాత వీడి అంతు నేను చూస్తాను" అన్నాడు రంగారావు మరో సిగరెట్టు వెలిగించుకుంటూ.

కిందపడిన వాడిని రాజు పైకి లేవదీశాడు. వాడు భయంతో ఛే బూతులు తిడుతున్నాడు.

వాడి నోటిమీద మరోసారి బలంగా కొట్టాడు రాజు. వాడి నోట్లోనించి నెత్తురు బయటకొచ్చింది. లేవలేని స్థితిలోకి వచ్చాడు. వాడి మొహంమీద కాలి సత్తువకొద్దీ తన్నాడు. విసుగు పుట్టేవరకూ అలా తంతూనే వున్నాడు.

"ఇక నీ ఇష్టం రంగారావ్" అన్నాడు తర్వాత రాజు.

రంగారావు జేబులోనించి కత్తి బయటకు తీశాడు. మూలుగుతున్నాడు వాడు. వాడి మొహమంతా నెత్తు

రుతో నిండివుంది.

రంగారావు విసురుగా కత్తిని వాడి భుజంలోకి దింపాడు.

కెవ్వున అరిచాడు వాడు. నెత్తురు పైకి చిమ్మింది.

కత్తిని బయటకులాగి వాడి షర్టుకు తుడిచి మడిచి జేబులో పెట్టుకున్నాడు.

"ఎవరో వస్తున్నారు." అన్నాడు రాజు సైకిలు స్టాండు తీస్తూ.

రంగారావు సైకిలుమీద ఎక్కాడు. వెనుక కూర్చు న్నాడు రాజు.

సైకిలు చీకట్లోకి దూసుకుపోయింది. రోడ్డుపక్కనే పడివున్న వాడికి స్పృహపోయింది.

4

తలుపుమీద యెవరో తడుతుంటే మెలకువ వచ్చింది రాజుకి.

కళ్ళు తెరిచాడు.

టేబిల్ మీద గడియారం కనిపించింది. సమయం ఎని మిదిన్నరవుతోంది.

బెడ్ మీద రంగారావు నిద్రపోతున్నాడు ముసుగు పెట్టి. రాత్రి రంగారావు, రాజు ప్రశాంతంగా నిద్ర పోయారు. బద్ధకంగా లేచి నిల్చున్నాడు రాజు.

మెల్లగావచ్చి తలుపు తెరిచాడు.

"మీరా!" అన్నాడు ఆశ్చర్యంగా.

"అవును. మీరు ఎక్స్ పెక్ట్ చెయ్యలేదనుకుంటాను" నవ్వుతూ అన్నది.

"అవును....రండి" లోపలకు పిల్చాడు.

కుర్చీలో కూర్చుంది వచ్చి.

"ఎలావుంది మీ ఆరోగ్యం?" నవ్వుతూ అడిగింది.

"బాగయ్యింది."

"ఇప్పుడే లేచారా?"

"అవును. ఐదునిమిషాల్లో వస్తాను" అని బాత్ రూమ్ లోకి నడిచాడు రాజు.

పదినిమిషాల తర్వాత స్నానం కూడా ముగించాడు. ఆతను ప్యాంటు, షర్టు వేసుకుని తలదువ్వుకుంటున్నప్పుడు రంగారావు లేచాడు.

అతనికి కస్తూరి కనిపించింది.

"ఎవరీ అమ్మాయి? ఇంతకుముందు చూళ్లేదు"అన్నాడు.

"నన్ను కొట్టించిన అమ్మాయి, కస్తూరి" చెప్పాడు రాజు. కస్తూరి రంగారావుకు నమస్కారం చేసింది.

"నా ఫ్రెండ్ రంగారావ్."

రంగారావ్ బ్రష్ తీసుకొని బాత్ రూంలోకి నడిచేడు.

"ఇప్పుడు చెప్పండి. ప్రొద్దున్నే ఇలా మా గదికి వచ్చారు?" అడిగాడు రాజు.

"మీరు యెలా వున్నారో చూసిపోదామని వచ్చాను"

"థాంక్స్."

"నోమెన్షన్. అది నా ధర్మం. ఇంకో విషయం.... మిమ్మల్ని మా నాన్న తనదగ్గరకు తీసుకురమ్మని పంపారు నన్ను."

"నన్నా! యెందుకు?"

"మీకు ఆయన ఉద్యోగం ఇస్తాడుట."

"ఉద్యోగమా?"

"అవును. మీరు నిరుద్యోగి కదా! మా నాన్న ఫర్మ్ లో ఓ క్లర్కు పోస్టుకు ఖాళీ వచ్చిందిట. మీకు ఇష్టమయితే ఆ ఉద్యోగంలో మీరు చేరవచ్చు."

"అయామ్ లక్కీ" అన్నాడు రాజు హుషారుగా.

"మీ ధైర్యమే మీ కిప్పుడు ఉద్యోగాన్నిస్తూంది" నవ్వుతూ అన్నది కస్తూరి.

"కాదు మీరు," అన్నాడు రాజు ఆమె కళ్ళలోకి చూస్తూ. తర్వాత—ఆమెతో బయటకు నడిచాడు.

5

వరండాలో కూర్చుని పేపర్ చదువుతున్నాడు శివపాదం.

"నమస్కారం సార్" అన్నాడు రాజు.

"నమస్తే" అన్నాడాయన రాజుకి కుర్చీచూపుతూ.

తండ్రిపక్కనే కూర్చుంది కస్తూరి.

"అమ్మాయి నీకు చెప్పేవుంటుంది."

"అవును సార్."

"క్లర్కుపోస్టు....జీతం ఆరొందల పది. బోనస్ కూడ ఇస్తారు. ఇష్టమేనా?"

"ఇష్టమే సార్."

"రేపు ఉదయం సర్టిఫికేట్లతో ఆఫీసుకురా" అని ఎడ్రసు ఇచ్చాడు శివపాదం.

"థాంక్స్‌సార్....మీ ఋణం తీర్చుకోలేనిది"అన్నాడు రాజు.

"డోన్ట్ మెన్షన్. ఇది ఋణం తీర్చుకునే ప్రయత్నమే అబ్బాయ్. ఎక్కువ మాట్లాడకు"

"అలాగేసార్....ఇక నే వెడతాను" లేచి నిల్చుంటూ అన్నాడు.

"ఐదు నిముషాలు ఆగండి" అని లోపలకు వెళ్ళింది కస్తూరి.

"కాళ్ళూ చేతులూ స్వాధీనంలోకి వచ్చాయా" అడిగాడాయన నవ్వుతూ....

"వచ్చాయి సార్"

"అదృష్టవంతుడివి"

"అవును సార్."

"నువ్వు నన్ను బాగా ఆకర్షించావోయ్"

"థాంక్స్ సార్" అన్నాడు రాజు నవ్వుతూ....

ఇంతలోనే కస్తూరి రెండు కప్పులతో హార్లిక్స్ తెచ్చి ఓ కప్పు రాజుకు ఇచ్చింది.

"ఇప్పుడు వద్దు" అన్నాడతను.

"మీకు అవసరమయినప్పుడు నేను ఇవ్వలేను" అన్నది నవ్వుతూ.

"గుడ్ జోక్" అన్నాడు శివపాదం.

హార్లిక్స్ తాగి, మరోసారి వాళ్ళిద్దరికీ థాంక్స్ చెప్పి బయటకు వచ్చాడు రాజు.

అతనికి గాల్లో తేలిపోతున్నట్టుగా వుంది. ఇంత సులభంగా ఆరువందలిచ్చే ఉద్యోగం వస్తుందని కలలోకూడా అనుకోలేదు.

'ఎలాగయినా రంగారావుకు కూడా ఓ ఉద్యోగం చూడాలి' అనుకున్నాడు.

నిజానికి రంగారావుకు ఈ ఉద్యోగం చెయ్యవలసిన అవసరంలేదు. అతనికి తన స్వంత వూళ్ళో కావలసినంత పొలం వుంది. రెండు ఇళ్ళు వున్నాయి. అయినా అతనికి నగరంమీద వ్యామోహం. అందుకే చదువు అయిపోయినా నగరాన్ని విడిచిపెట్టలేదు.

రాజును చూడగానే రంగారావు అరిచాడు.

"ఏమిటి భాయ్? ఏమిటి కథ?" అడిగాడు నవ్వుతూ.

"కథకాదు. నాకు ఉద్యోగం వచ్చింది. నెలకు ఆరు వందలు."

"నిజమా!"

"అవును. ఈ అమ్మాయి తండ్రి శివపాదం ఇచ్చాడు"

"నువ్వు అదృష్టవంతుడివి"

"అవును...."

"అయితే ఈరోజు నువ్వు నన్ను సినిమాకు తీసుకు వెళ్ళాలి"

"నీ యిష్టం...."

"థాంక్స్"

"ఇవాళ మిగిలిన ఇద్దరిలో ఎవరయినా దొరికితే బావుండు" అన్నాడు రంగారావు.

"రాత్రి వాడు బతుకుతాడంటావా?"

"ఇంతకు ముందే వెళ్ళి చూశాను. వాడు అక్కడ లేడు"

"వాళ్ళలో ఎవరయినా వచ్చి తీసుకెళ్ళారేమో"

"అవును. మిగిలిన ఇద్దర్నీ పొడిస్తేగానీ నా పగ చల్లారదు. రంగారావు స్నేహితుడిని తన్నటానికి ఎన్ని గుండెలు వెధవలకు.... నా సంగతి తెలియజేస్తాను" అన్నాడు కోపంగా రంగారావు.

6

స్నేహితులిద్దరూ మొదటి ఆట ఓ హిందీ సినిమాకు వెళ్ళారు.

పిక్చరు చాలా బావుంది. ఇంట్రస్టింగ్ గా వుంది. అయితే చాలా చిన్న సినిమా....

ఇంటర్వెల్ అయింది.

ఇద్దరూ బయటకు వెళ్ళాలని లేచి నిలుచున్నారు. ఇంతలోనే రాజు దృష్టి ముందువరుసలోనించి బయటకు వెళుతున్న ఒకడిమీద పడింది.

వాడు బాగా పొట్టిగా సైనావాడిలా వున్నాడు.

"రంగా.... వాడిని చూడు" అన్నాడు గబుక్కున వాడిని చూపుతూ....

చూశాడు రంగారావు....

వాడు గళ్ళ బనీను వేసుకున్నాడు—నల్లగా కాకిలా వున్నాడు.

"ఎవడు వాడు? ఆ ముగ్గుర్లో ఇంకొకడా?" అడిగాడు.

"అవును" అన్నాడు రాజు.

"పద.... వాడి వెనుకే వెళదాం"

ఇద్దరూ బయటకు వెళ్ళారు.

వాడు రెండు సమోసాలు తిని, టీ తాగి మళ్ళీ లోపలకు వచ్చాడు.

వాడి వెనుకే రంగారావు—రాజు లోపలకు వచ్చారు. వాడు వాళ్ళిద్దరినీ చూడలేదు.

వాడు కూర్చున్నాడు. వాడి పక్కనే మిగిలినవాళ్ళు కూడా వున్నారేమోనని చూశాడు రాజు. లేరు. సినిమా మళ్ళీ మొదలయ్యింది.

"వాడు మధ్యలో వెళ్ళిపోతాడేమో" అన్నాడు రాజు.

"అందుకే వాడిమీద ఒక కన్ను వేసి వుంచుదాం" అన్నాడు రంగారావు.

సినిమా చూస్తున్నా మధ్య మధ్యలో వాడికేసి చూస్తున్నారు ఇద్దరూ.

సినిమా అయిపోయింది.

జనం గబగబా బయటకు వస్తున్నారు నెట్టుకుంటూ. వాడి వెనుకే ఇద్దరూ బయటకు వచ్చారు.

వాడు స్టాండులోవున్న సైకిలు తీసుకున్నాడు.

రంగారావు తన సైకిలు తీశాడు.

అది నాలుగురోడ్ల కూడలి కావటంవల్ల జనం నాలుగు వైపులకూ చెదిరిపోతూరు.

వాడు సైకిలుమీద నెమ్మదిగా పోతున్నాడు సిగరెట్టు వెలిగించుకుని.

వాడివెనుకే రంగారావు—రాజు సైకిలుమీద వెళుతున్నారు.

వాళ్ళ ముందునించి రిక్షాలు, ఆటోలు రివ్వున వెళుతున్నాయి.

వాడు సైకిలు వేగం పెంచకుండా అలాగే తొక్కుతున్నాడు. రంగారావుకు విసుగ్గా వుంది.

వాడు వున్నట్టుండి ఓ చీకటి సందులోకి మళ్ళాడు.

"మన అదృష్టం పండింది" అన్నాడు రంగారావు.

"ఎందుకు?" రాజు అడిగాడు.

"వాడు పల్లంలోకి వెళుతున్నాడు దగ్గర దారి అని" రాజు మాట్లాడలేదు.

వాడు సందు చివరకు వెళ్ళి పల్లంలోకి సైకిల్ని పోనిచ్చాడు. ఇక ఆ పయిన చాలా దూరంవరకు ఇళ్ళు లేవు. అంతా చీకటి. గాఢాంధకారం....

వాడి సైకిలు కిర్రుమని చప్పుడు చేస్తోంది.

రివ్వున సైకిలును ముందుకు పోనిచ్చి వాడి సైకిలుకు తగిలించాడు రంగారావు.

అప్పటికే రాజు కిందకు దూకాడు.

వాడు కిందపడ్డాడు. వాడు లేవకముందే రాజు వాడి తలమీద బూటుకాలితో గట్టిగా తన్నాడు.

"ఎవడ్రా నువ్వు?" అన్నాడు వాడు గట్టిగా....

"ఏరా హీరోనిరా....ముగ్గురు కలిసి ఒక్కడిని కొడ తార్రా....ఇప్పుడు రారా...." అన్నాడు మళ్ళీ తన్ని....

"సువ్వా....నిన్ను బతకనివ్వడం తప్పయింది....ఇప్పుడు చంపుతాను" అంటూ వాడు ఎగిరి నిలబడ్డాడు.

అప్పటికే బెల్టు బయటకు తీసి నిలబడ్డాడు రాజు. వాడు కొంచెం ముందుకు రాగానే ఈడ్చి బెల్టుతో మొహంమీద చరిచాడు.

"చచ్చాన్రోయ్" కేక పెట్టాడు వాడు.

"ఇంకా చావలేదురా" అని మరోసారి వీపుమీద చరిచాడు. అతనికి గుండె మండుతోంది. ఆ రోజు రాత్రి ఒక్కడిని ముగ్గురు కలిసి దయలేకుండా నెత్తురు కారినంత వరకూ కొట్టారు.

వీడిని అంత సులభంగా వదలకూడదు.

మరోసారి కొట్టాడు. బెల్టు వాడి వంటిమీద వాతలను పెడుతోంది. వాడు నిలవలేక కిందపడ్డాడు. కింద పడి కూడా 'నిన్ను చంపుతాను' అని అరుస్తున్నాడు.... వాడలా అరచినకొద్దీ మరింతగా కొడుతున్నాడు రాజు.

వాడికి వంటిమీద నెత్తురు చిమ్మింది.

"ఇక నీ వంతు" అన్నాడు రాజు-రంగారావుతో....

రంగారావు జేబులోనించి కత్తిని బయటకు తీసాడు. దాన్ని వొంగి బలంగా వాడి భుజంలో గుచ్చాడు.

పెద్దగా అరిచాడు వాడు ప్రాణం పోతున్నట్టు.

కత్తిని వాడి బనీనుకు తుడిచి మడిచి జేబులో పెట్టుకున్నాడు.

తర్వాత ఇద్దరూ సైకిల్ని ఆ పల్లంలో నడిపించుకుంటూ చీకట్లో కలిసిపోయారు.

'పని చాలా తక్కువ' అనుకున్నాడు రాజు. అతను ఆ రోజునే ఉద్యోగంలో జాయినయ్యాడు.

అతను చేరగానే తోటి ఉద్యోగులు రాజును పార్టీ ఇవ్వమన్నారు.

సంతోషంగా పార్టీ ఇచ్చాడు రాజు. వాళ్ళంతా అతనికి థాంక్స్ చెప్పారు. అతనికి మంచి స్నేహితులయినారు. సాయంత్రం అయిదయింది.

అప్పటికే అందరూ ఫైల్సు మూసేసి ఆఫీసు వదలటానికి సిద్ధంగా వున్నారు.

రాజు ఎప్పుడో రెడీ అయ్యాడు. అతని పని మూడు గంటలకే అయిపోయింది.

ఐదు గంటలు దాటిన తర్వాత బయటకు వచ్చాడు రాజు.

ఒంటరిగానే సిగరెట్టు వెలిగిస్తూ కొంత దూరం నడిచాడు. బస్టాపు కనిపించింది. అక్కడ చలామంది మనుషులు నిలబడి వున్నారు.

తనుకూడా వాళ్ళదగ్గరగా నిలబడ్డాడు. అప్పుడే ఏదో బస్సు వచ్చి ఆగింది.

అందులోనించి కస్తూరి దిగింది. రాజు ఆమె కేసి ఆశ్చర్యంగా చూశాడు. ఆమె చేతిలో బుక్స్ వున్నాయి.

"హల్లో రాజుగారూ" అన్నది అతన్ని చూడగానే.

అతను నవ్వాడు.

"కాలేజీనించా?"

"అవును" అన్నది.

"ఇక్కడికెందుకు వచ్చారు? పనివుందా?" అడిగాడు

రాజు.

"మీ కోసమే వచ్చాను" అన్నది కస్తూరి.

"నాకోసమా!"

"అవును" అంటూ పార్కు వైపు దారితీసింది.

అక్కడికి పార్కు చాలా దగ్గర్లో వుంది.

నడుస్తూండగా "ఎలా వుంది మీ ఉద్యోగం?" అన్నదా అమ్మాయి కస్తూరి అతని కళ్ళల్లోకి చూడకుండా-ఎటో చూస్తూ.

"నా కంతా అయోమయంగా వుంది" అన్నాడు రాజు.

"ఉద్యోగమా"

"కాదు. మీ ప్రవర్తన"

"చెబుతాను. ముందు పార్కులోకి వెళ్ళనివ్వండి"

పార్కులో బోగన్‌విల్లా చెట్టు పక్కనే కూర్చున్నారు.

"ఇప్పుడు చెబుతాను" అన్నది కస్తూరి.

"చెప్పండి" అన్నాడు రాజు సగరెట్టు వెలిగిస్తూ....

"నేనే మీకు ఉద్యోగం ఇవ్వమని నాన్నతో చెప్పాను. నాన్న నామాట కాదనడు. నాకు అమ్మలేదు. అందుకే నాన్న నాకోసం ఏమయినా చేస్తాడు."

"ఇదంతా నాకు ఎందుకు చెబుతున్నారు?"

"నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను రాజూ"

రాజు ఆశ్చర్యపోలేదు అంతగా....కస్తూరి ప్రవర్తన అతనికి కొంతవరకూ అర్థమవుతూనే వుంది.

"నువ్వు నాకు బాగా దగ్గరయ్యావు కస్తూరీ" అన్నాడు రాజు ఆమె చేతిని గట్టిగా నొక్కుతూ.

"రాజూ.... మైడియర్" అన్నది కస్తూరి చిన్నగా....

అప్పటికే చీకటిపడింది.

రాజు ముందుకు వొంగి ఆమె బుగ్గలమీద సున్నితంగా ముద్దు పెట్టుకున్నాడు.

కస్తూరి ఓ విధమయిన మైకంతో చిన్నగా వణికింది.

తలెత్తాడు రాజు. అతనికి దూరంగా నిలబడిన ఓ మనిషి కనిపించాడు. అతన్ని చూడటంతోటే గుర్తించాడు రాజు.

వాడు ఆ ముగ్గురిలో మూడోవాడు.

రాజుకు ఏం చెయ్యాలో అర్థంకాలేదు. ఇప్పుడు వాడేదయినా చేస్తే....తను ప్రతిఘటిస్తాడు. కాని తనకేమయినా జరిగితే....కస్తూరి వాడి చేతిలో చిక్కుతుంది.

"ఏమిటలా అయిపోయావ్ రాజూ" అన్నది కస్తూరి.

"ఏమీలేదు....చీకటి పడింది ఇక వెడదాం" అన్నాడు.

అయిష్టంగానే నిలబడింది కస్తూరి.

పార్కులోనించి బయటకు వచ్చారు. బయటకు రాగానే వాడికోసం చూశాడు రాజు. కాని వాడు ఎక్కడా కనిపించలేదు.

"నిన్ను ఇంటిదగ్గర డ్రాప్ చేసి నేను గదికి వెళతాను" సరేనన్నది కస్తూరి.

ఆటోలో బయల్దేరారు.

పది నిముషాల తర్వాత కస్తూరి ఇంటి ముందాగింది ఆటో. "మళ్ళీ రేపు" అన్నది కస్తూరి.

"గుడ్ నైట్" అన్నాడు రాజు. కస్తూరి చెయ్యి వూపింది.

ఆటో ముందుకు కదిలింది.

రాజు ఆ మూడోవాడి గురించే ఆలోచిస్తున్నాడు. వాడు తనని ఎందుకు వదిలాడు. ఏదయినా ప్లాను వేస్తు

న్నాడో. ఆలోచిస్తుండగానే ఆటో గది ముందాగింది. దిగి ఫేర్ చెల్లించాడు. ఆటో వెళ్ళిపోయింది.

రాజు లోపలకు వెళ్ళగానే అతని గదిముందు ఓ. ఆటో దూసుకుపోయింది. ఆ ఆటోలో కూర్చున్న ఆ మూడోవాడు రాజు గదికేసి చూసి కసిగా నవ్వాడు.

8

రాత్రి పదకొండు గంటలవరకూ రాజు—రంగారావూ కబుర్లు చెప్పుకున్నారు.

రాజు - రంగారావుతో ఆ రోజు సాయంత్రం జరిగిన దంతా చెప్పాడు.

"నువ్వో అదృష్టవంతుడివి రాజూ" అన్నాడు రంగా రావు.

చివరికి పార్కులో కస్తూరితో మాట్లాడుతున్నప్పుడు దూరంగా ఆ మూడోవాడు కనిపించిన విషయంకూడా చెప్పాడు రాజు.

"వాడిని ఎందుకు వదిలావ్?" అన్నాడు రంగారావు.

"ఏం చేసేది? పక్కనే కస్తూరి వుంది. పెద్ద గొడవవు తుంది. కస్తూరి భయపడుతుంది. అందుకే వాడిని వదిలే శాను."

"పోన్లే ఎప్పుడో ఒకప్పుడు దొరక్కపోడు. ఈసారి కనిపిస్తే వాడిని వదలొద్దు" అన్నాడు రంగారావు.

"అలాగే" అన్నాడు రాజు.

ఆ తర్వాత ఇద్దరూ మాట్లాడుకోలేదు.

రాజు - కస్తూరిగురించిన కలలుకంటూ నిద్రలోకి జారు కున్నాడు.

రాత్రి ఒంటిగంట దాటింది.

రాజు - రంగారావు నిద్రపోతున్నారు గాఢంగా....

బయట తలుపుమీద ఎవరో గబగబా తట్టారు.

ఇద్దరిలో ఎవ్వరికీ మెలకువ రాలేదు.

రాజుది మొద్దు నిద్ర. అతనికి అంత సులభంగా మెలుకువ రాదు.

రంగారావుకే మెలుకువ వచ్చింది.

"ఎవరు?" అన్నాడు పక్కమీదనించి లేవకుండానే.

"టెలిగ్రాం"

అతని బద్ధకం వదిలిపోయింది. లేచి లైటు వేశాడు. తర్వాత తలుపు తెరిచాడు. బయటకు వెళ్ళాడు.

బయట ఎవ్వరూ కనిపించలేదు.

రంగారావుకు ఆశ్చర్యం కలిగింది. కలకాదు. నిజంగానే ఎవరో టెలిగ్రాం అన్నారు.

మరి ఎవరూ కనిపించరేం?

రంగారావు మనసులో ఏదో అనుమానం పొడసూపింది. అతను వెంటనే వెనక్కు తిరగబోయాడు. కాని అప్పటికే ఆలస్యమయింది.

ఇద్దరు చీకట్లోనించి అతనిమీద పడి గట్టిగా పట్టుకున్నారు. గింజుకున్నాడు. కాని వాళ్ళు వదల్లేదు.

అతను అరవబోయాడు. నోరు నొక్కేశారు.

అతని గుండెల్లోకి బలంగా కత్తి దిగింది. నెత్తురు బయటకు చిమ్మింది.

ఆ తర్వాత అతన్ని కసిదీరా చాలాసార్లు పొడిచారు. రంగారావు చచ్చిపోయాడు. కుప్పలా కూలిపోయాడు. వాళ్ళు చీకట్లో కలిసిపోయారు.

నెత్తురు మడుగు కడుతోంది.

రాజు గాఢనిద్రలో వున్నాడు.

గది తలుపులు తెరిచే వున్నాయి.

రంగారావు శవం వికృతంగా వుంది.

9

తెల్లారి పోలీసులొచ్చారు.

రాజు ఏడ్చాడు. గుండెలు పగిలేలా ఏడ్చాడు. అతనిలో ఓ విధమయిన పిరికితనం చోటుచేసుకుంది.

జరిగిందంతా పోలీసులకు చెప్పాడు రాజు.

మొత్తం పన్నెండు పోట్లు. గుండెనిండా చిల్లులు పడ్డాయి. నెత్తురు మయమయిపోయింది రంగారావు శవం.

వేలిముద్రలు దొరకలేదు.

హత్య విషయం శివపాదానికి తెలిసింది. ఆయనా, కస్తూరి వచ్చారు.

రాజు యేడవటం చూసి ఇద్దరూ చలించిపోయారు. రంగారావు తనకు ఎలాంటి స్నేహితుడో ఎన్నోసార్లు వాళ్ళతో చెప్పాడు రాజు.

కస్తూరి అతన్ని ఓదార్చింది. అయినా రాజు దుఃఖం తీరలేదు. వాళ్ళు తనమీదవున్న కసిని రంగారావుమీద చూపించారు.

రాత్రి అసలు ఏం జరిగిందో? రంగారావు ఎందుకు బయటకు వెళ్ళాడో? బహుశ, వాళ్ళు తలుపులు తట్టి వుండవచ్చు.

తను బయటకు వెళ్ళినట్లయితే? తననే చంపేవాళ్ళు. మైగాడ్! రంగారావు తనకోసం బలయిపోయాడు. రంగారావు—ఎంత మంచి స్నేహితుడు? తనకు కొండంత బలం.

తను రంగారావు తోడుచూసే ధయిర్యంగా తిరుగు

తున్నది. ఎంతోమంది రంగారావుకు భయపడే తన జోలికి రాకుండా వున్నది.

ఇప్పుడు వాళ్ళందరికీ తనమీద చులకన కలుగుతుంది.

పోలీసులు రాజును చాలా ప్రశ్నలు అడిగారు.

రాజు అన్నింటికీ సరయిన జవాబులు ఇవ్వలేదు. తను, రంగారావు ఆ ఇద్దరినీ చీకట్లో కొట్టి కత్తితో పొడిచిన విషయం చెప్పలేదు.

పోలీసులతోపాటు రాజు స్టేషన్‌కు వెళ్ళాడు. అక్కడ రిపోర్టు ఇచ్చాడు.

తననికూడా వాళ్ళు పొడిచి చంపవచ్చనే భయాన్ని పోలీసులముందు వ్యక్తం చేశాడు. పోలీసులు అతన్ని భయపడవద్దని చెప్పారు.

రాజుకి ఆ ముగ్గురిమీద అంతులేని కసి ఏర్పడింది. దొరికితే ముగ్గురినీ చంపాలన్నంత ఆవేశం వచ్చింది. కాని తను వాళ్ళంత దుర్మార్గుడు కాదు. తను హత్యలు చెయ్యలేడు. రంగారావు పోవడంతో తనలోవున్న ధైర్యం పోయింది.

తనకేదయినా అయితే? కస్తూరి భరించగలదా? ఇప్పుడు తను కస్తూరి కోసమయినా జాగ్రత్తగా వుండాలి. రాజు ఎలాగో మనసును దిటవుపరుచుకున్నాడు.

పదిరోజులు గడిచాయి.

రాజు ఎంతో జాగ్రత్తగా ఆఫీసుకు వెళ్ళి వస్తున్నాడు. రోజూ కస్తూరిని కలుస్తూనే వున్నాడు. కస్తూరి మాటలు అతన్ని వూరడిస్తున్నాయి. కస్తూరి ప్రేమ అతడి దుఃఖాన్ని మరిపింప చేస్తోంది.

ఆ గదిలో వుండలేకపోయాడు రాజు. అతడికి ఆ గదిలో వున్నంతసేపూ రంగారావే గుర్తుకొస్తున్నాడు. భరించలేకపోయాడు.

రంగారావు తనకు ప్రాణమిచ్చేవాడు. తనకోసం చచ్చిపోయాడు. రంగారావు స్నేహం తనకు లేకుండా పోయింది. అది తనకు తీరని లోటు....

రాజుకు చాలాసార్లు ఏడుపు వచ్చింది. నిద్రపట్టేది కాదు.

రాజు బాగా చిక్కిపోయాడు. కళ్ళు లోపలకు పోయాయి. కస్తూరి అతడిలో మార్పును సులభంగానే గ్రహించింది.

"నువ్వు ఈ గదిని మార్చెయ్యి రాజూ" అన్నది.

"నాకూ అలాగే అనిపిస్తోంది" అన్నాడు రాజు.

"మా ఇంటి పక్కనే మేడమీద ఓ గది ఖాళీ అయింది. అందులో వచ్చి చేరు" అన్నది.

ఒప్పుకున్నాడు రాజు. ఆరోజునే ఆ గదిని ఖాళీచేసి కొత్తగదిలోకి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి రాజు - శివపాదం ఇంట్లో భోజనం చేశాడు. పొద్దుపోయేవరకూ శివపాదం—కస్తూరి—రాజు కబుర్లు చెప్పుకున్నారు. తర్వాత రాజుకు నిద్ర ముంచుకొచ్చింది. తన గదికి వెళ్ళిపోయాడు.

పక్కమీద పడుకున్నాడు గానీ నిద్రపట్టలేదు. కళ్ళముందు వికృతంగా వున్న రంగారావు శవమే కనిపిస్తోంది. వాళ్లు ముగ్గురూ తననికూడా అలాగే పొడిచి చంపుతారా? తనకి వాళ్ళ పేర్లుకూడా తెలీదు అనుకున్నాడు రాజు.

వాళ్ళ పేర్లు దాసు—రాజన్—సుందరం.

10

సిగరెట్టు దమ్ము కొడుతున్నాడు దాసు. అతడి కళ్ళు వీధిదీపం కింద నిలబడిన ఆమె మీదే వున్నాయి.

ఆమె ఒంటరిగా అక్కడ నిలబడి వుంది.

అయిదు నిముషాల క్రితం దాసు ఆమెను చూశాడు. చూడగానే ఆమె ఎటువంటిమనిషో చూద్దామని అనిపించి అక్కడే నిలబడి పరిశీలిస్తున్నాడు.

మరో ఐదు నిమిషాలు గడిచాయి.

అప్పటికే వీధిలో రద్దీ తగ్గిపోయింది. బస్టాపుకు కొంచెం దూరంలో నిలబడింది ఆమె.

అప్పుడప్పుడు బస్సులు తిరుగుతున్నాయి.

బాగా చలిగా వుంది. జేబులో చేతులు పెట్టుకున్నాడు దాసు. అతని నోట్లో సిగరెట్టు ఎర్రగా వెలుగుతోంది. దాసు తనని గమనించటం చూసిందామె. ఒక్కసారి వొళ్ళు విరుచుకుంది.

నవ్వుకున్నాడు దాసు. చేతిలో సిగరెట్టును విసిరేశాడు. గబగబా ఆమె దగ్గరకు నడిచి పక్కనే నిలబడ్డాడు.

ఒక్కసారి ఆమె దాసును చూసింది. నల్లగా వున్నాడు దాసు. ఆమెకూడా నల్లగానే వుంది. పుష్టిగా, బలంగా వుంది.

"నీ పేరేమిటి?" అడిగాడు దాసు.

"పేరుతో పనేమిటి?" అన్నది.

"ఎంత?" అన్నాడు నవ్వుతూ....

"నువ్వు ఇవ్వగలిగినంత."

"రూపాయిస్తాను. వస్తావా?"

నవ్విందామె.... "పద వెడదాం" అన్నది తర్వాత. అలా అన్నవాళ్ళే తర్వాత పాతికో, ముప్పయ్యో ఇస్తారని ఆమెకు తెలుసు.

"గది వుందా నీకు?" అడిగాడు దాసు.

"వుంది. కాని దూరం....నీ గది వుంటే వెళదాం"

"పద" అన్నాడు దాసు ముందుకు కదిలి.

"రిక్షాలో వెళదాం".

దూరంగా వస్తోంది రిక్షా. దగ్గరకు రాగానే దాన్ని ఆపాడు. ఎక్కారు. ఎడ్రసు చెప్పాడు.

రిక్షావాడు సన్నగా, బలహీనంగా వున్నాడు. నెమ్మదిగా తొక్కుతున్నాడు. బరువుగా పోతోంది రిక్షా.

రిక్షా మెయిన్ రోడ్డుమీదకు మళ్ళింది.

దుకాణాలు చాలావరకు మూసివున్నాయి. రోడ్డు పక్కనే బండ్లమీద పళ్ళు అమ్మేవాళ్ళు గట్టిగా అరుస్తున్నారు.

దాసు రిక్షా దిగి నాలుగు ఆపిల్ పండ్లు కొన్నాడు.

"బావున్నాయి" అన్నదామె.

"మనిద్దరికీ" అంటూ నవ్వాడు దాసు.

పావుగంట తర్వాత రిక్షా దాసు గదిముందు ఆగింది. దిగారు. డబ్బులిచ్చాడు దాసు రక్షావాడికి.

పండ్లు ఆమె పట్టుకుంది. దాసు తలుపులు తెరిచాడు. లోపలకు వెళ్ళారు.

"చాలా చిన్న గది" అన్నదామె లైటువేసిన తర్వాత గదిని చూసి.

"దీనికే ఎనభై రూపాయలు కిరాయి" అన్నాడతను తలుపులు మూస్తూ....

దాసుకు ఎవ్వరూ లేరు. అతనికి స్నేహితులే వున్నారు. అతను చిన్నచిన్న దొంగతనాలు చేస్తాడు. ఇంతవరకూ ఒక్కసారికూడా పోలీసులకు దొరకలేదు. అది అతని అదృష్టం.

దాసు లుంగీ కట్టుకున్నాడు.

ఆమె బెడ్ మీద కూర్చుంది.

"నువ్వేం చేస్తుంటావ్?" అని అడిగింది అతన్ని....

"నీలాంటి వాళ్ళను రాత్రిపూట గదికి తెస్తూ వుంటాను"

"పగటిపూట"

"నిద్రపోతాను" అన్నాడు నవ్వుతూ....

"గట్టివాడివే"

"నీకే తెలుస్తుంది" అంటూ నవ్వాడు.

ఆమెకూడా నవ్వింది.

"లైటు తియ్యనా" అన్నాడతను.

"నీ యిష్టం"

"అయితే వొద్దు" అన్నాడు టేబిల్ సొరుగులోనించి కత్తిని బయటకు తీస్తూ.

"కత్తి ఎందుకు?" అడిగిందామె.

"భయపడకు .... పండ్లు కొయ్యటానికి" అన్నాడు ఆమె పక్కనే కూర్చుని నవ్వుతూ.

"ఇప్పుడు చెప్పు నీ పేరేమిటి?" అడిగాడు దాసు.

"రాజేశ్వరి" ముక్కలు తింటూ చెప్పింది.

"తగిన పేరు" అన్నాడు కాయను అందుకుంటూ....

ఉన్నట్టుండి దాసు చేతిలో కత్తి కిందపడింది. దాన్ని వొంగి తీసుకోబోయాడు అతడు.

అతను చూస్తుండగానే కత్తి గాలిలో పైకి లేచింది. దాసుకు ఆశ్చర్యం కలిగింది. తర్వాత భయం పుట్టింది. కళ్ళు పెద్దవి చేసి చూస్తున్నాడు.

ఆమెకూడా ఆశ్చర్యంగా గాలిలో తేలుతున్న కత్తినే చూస్తోంది.

ఇద్దరూ చూస్తుండగానే కత్తి కొంచెం కిందికి దిగింది. దాసు దాన్ని అందుకోబోయాడు.

కాని అది విసురుగా వచ్చి అతని గుండెల్లో దిగబడింది. కెవ్వున అరిచాడు దాసు.... నెత్తురు బయటకు దూకింది.

ఆమెకూడా పెద్ద కేక పెట్టింది భయంగా....

మరోసారి కత్తి బయటకు వచ్చి అతని గుండెల్లోకి దూసుకుపోయింది. నిర్జీవంగా వెనక్కి పడిపోయాడు దాసు. పక్కంతా నెత్తురుతో తడిసిపోయింది.

రెండు నిముషాలకు ఆమె షాక్ నించి తేరుకుంది. అంతే. వెంటనే గది తలుపులు తెరుచుకుని రోడ్డుమీదకు పరుగుదీసింది.

11

ఉదయం - తొమ్మిది గంటలు కావస్తోంది. స్నానం చేసి బట్టలేసుకుని తల దువ్వుకుంటున్నాడు రాజు. అతని గదిముందు పోలీసు జీపు ఆగింది. అందులోనించి ఇన్ స్పెక్టర్ దిగాడు.

అద్దంలో ఇన్ స్పెక్టర్ తన గదిలోకి రావటంచూసి వెనక్కి తిరిగాడు రాజు.

"హల్లో రాజూ....ఎలా వున్నావ్?" అడిగాడు ఇన్ స్పెక్టర్ నవ్వుతూ....

"బాగానే వున్నాను సార్"

"మొత్తానికి నీ పగ తీర్చుకున్నావుగా"

"పగా!"

"అవును ఆ ముగ్గురిలో ఒకడిని పొడిచేశావుగదా!"

"ఎవడ్ని సార్"

ఇంతలోనే అక్కడకు శివపాదం వచ్చాడు "ఏమిటి ఇన్ స్పెక్టర్" అంటూ....

రాత్రి జరిగిన దాసు హత్యగురించి చెప్పాడు ఇన్ స్పెక్టర్.

"ఆశ్చర్యంగా వుంది" అన్నాడు శివపాదం.

"రాత్రి నువ్వు ఎక్కడ వున్నావ్?"

"గదిలోనే వున్నాను" చెప్పాడు రాజు.

"సాక్ష్యం వుందా?"

"రాత్రి పన్నెండు గంటలు దాటేవరకూ నేను, రాజు, మా అమ్మాయి కస్తూరి మా ఇంట్లోనే మాట్లాడుకుంటూ కూర్చున్నాము" చెప్పాడు శివపాదం.

"ఆశ్చర్యంగా వుంది" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"అసలు అతను రాజుకు శత్రువో కాదో" అన్నాడు శివపాదం.

"నిజమే. ముందు ఆ విషయం తేల్చుకోవాలి. కాని రాజు ఇంతకుముందు చెప్పిన గుర్తులను బట్టి అతనే. అయినా నువ్వు ఒకసారి మాతో రా" అన్నాడు రాజుతో.

గదికి తాళంపెట్టాడు రాజు.

శివపాదంకూడా ఇంటికి తాళంపెట్టి వచ్చాడు. కస్తూరి ఇంట్లో లేదు. ఎర్లీగానే కాలేజీకి వెళ్ళిపోయింది.

జీపు బయల్దేరింది. ఇరవై నిమిషాల తర్వాత దాసు ఇంటిముందు ఆగింది.

గబగబా కిందకు దిగాడు రాజు. అక్కడ పోలీసులూ డాక్టరూ వున్నారు.

శవాన్ని చూశాడు. అతనికి ఆశ్చర్యం కలిగింది.

"అవును. ఇతను ఆ ముగ్గురిలో వాడే" అన్నాడు రాజు.

"డాక్టర్....హత్య ఎన్ని గంటలకు జరిగివుంటుంది" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"రాత్రి పదిన్నర పదకొండు గంటలమధ్య జరిగి వుండొచ్చు."

"ఆ సమయంలో రాజు మాతోనే వున్నాడు ఇన్‌స్పెక్టర్" అన్నాడు శివపాదం.

నవ్వాడు ఇన్‌స్పెక్టర్.

"ఎలాగయినా హంతకుడిని పట్టుకుంటాం రాజూ....ఇక మీరు వెళ్ళొచ్చు" అన్నాడు.

శివపాదం, రాజు ఆటోలో ఆఫీసుకి బయల్దేరారు టైము కావడంవల్ల.

"అతన్ని ఎవరు చంపారో అర్థంకావడంలేదు" అన్నాడు రాజు.

"అతనికి ఇంకెవరయినా శత్రువులు వున్నారేమో" అన్నాడు శివపాదం.

"అయివుండవచ్చు" అన్నాడు రాజు ఆలోచిస్తూనే.

ఆ రోజు రాజు ఆఫీసులో వర్కు చెయ్యలేక పోయాడు. అతని మనసంతా అదోలా అయిపోయింది. పోలీసులకు తనమీద అనుమానం వచ్చింది. బలవంతాన ఏవో లెక్కలు చూస్తున్నాడు రాజు. చూస్తూ మధ్యలో సిగరెట్టు వెలిగించుకోవటానికి పెన్‌ని పక్కన పెట్టి షర్టు జేబులోనించి సిగరెట్టు పెట్టె బయటకుతీసి వెలిగించుకున్నాడు.

ఇంతలోనే అతని పెన్ను పైకి లేచింది. ఆశ్చర్యంగా చూశాడు రాజు.

పక్కనేవున్న కాయితంమీద గబగబా రాసుకుంటూ పోయింది.

రాజుకి మతిపోయినంత పనయ్యింది ఆ అక్షరాలను చదువుతుంటే. నిమిషం తర్వాత పెన్ను ఆగిపోయింది.

'రాజూ—ఆ ముగ్గురూ నిన్నుకూడా చంపాలనుకున్నారు. అందుకే వాళ్ళలో ఒకడిని రాత్రి చంపాను. మిగిలిన ఇద్దర్నీకూడా చంపుతాను. నువ్వేం భయపడకు—నేనున్నాను—రంగారావు—'

మరోసారి ఆ అక్షరాలను చదివాడు రాజు. అతనికి నమ్మశక్యంకాలేదు. అది రంగారావు దస్తూరి.

అతని కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయినాయి. గబగబా ఆ కాయితాన్ని తీసుకుని శివపాదం గదిలోకి వెళ్ళాడు. దాన్ని చూపించి జరిగింది చెప్పాడు.

శివపాదం నమ్మలేకపోయాడు....

"రియల్లీ వండర్! చనిపోయిన మనిషి ఇలా రాశాడంటే" అన్నాడు.

"అవును సార్....ఇది నా కళ్ళెదుటే జరిగింది" అన్నాడు రాజు.

అతనికి ఎంతో సంతోషంగా వుంది. చచ్చిపోయినా రంగారావు తనని రక్షిస్తున్నాడన్నమాట. 'రంగారావ్! స్నేహితుడంటే నువ్వే....నిన్ను పోగొట్టుకోవటం నిజంగా నా దురదృష్టం' అనుకున్నాడు రాజు.

"ఈ కాయితాన్ని మనం పోలీసులకు చూపటం మంచిది" అన్నాడు శివపాదం.

"అలాగే" అన్నాడు రాజు.

సాయంత్రం అయిదు కాగానే శివపాదం, రాజు పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి ఆ కాయితాన్ని చూపించి జరిగింది చెప్పారు.

ఇన్‌స్పెక్టర్ నమ్మలేదు.

"కావాలంటే రంగారావు దస్తూరి వున్న పుస్తకాలు వున్నాయి, పోల్చి చూసుకోండి" అన్నాడు రాజు.

"అవసరంలేదు. మేము ఈ విషయాన్ని నమ్మటంలేదు. మీరు వెళ్ళిరండి" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

మాట్లాడకుండా బయటకు వచ్చారు రాజు-శివపాదం.

"నిజమే....ఇలా జరిగిందంటే ఎవ్వరూ నమ్మరు"

అన్నాడు శివపాదం గోడుమీద నడుస్తూ.

"నేనుకూడా నమ్మేవాడిని కాదు. కాని ఇది నా కళ్ళ ఎదురుగా జరిగింది. నమ్మకుండా ఎలావుంటాను" అన్నాడు రాజు.

ఇద్దరూ ఇంటికి వెళ్ళేసరికి కస్తూరి కాలేజీనించి వచ్చి వున్నది. ఆమె ఈ విషయాలన్నీ విన్న తర్వాత ఆశ్చర్య పోయింది.

"ఇలా జరిగే అవకాశం వుందా?" అని అడిగింది.

"ఏమో....అయితే ఇంతకుముందు నేను ఇలాంటి వింతలు జరిగినట్టు విన్నాను" అన్నాడు శివపాదం.

"నేను విన్లేదు" అన్నది కస్తూరి....

రాజు మాట్లాడలేదు. ఆ రాత్రి రాజు వాళ్ళతోటే కలిసి భోజనం చేశాడు. తర్వాత ముగ్గురూ రెండో ఆట ఓ ఇంగ్లీషు సినిమాకు వెళ్ళారు.

12

"నా దగ్గర డబ్బులు అయిపోయాయి" అన్నాడు రాజన్.

"అప్పులేదు గురూ" అన్నాడు పేకాట ఆడుతున్న నలుగురిలో ఒకడు.

"ఎవరయినా పాతిక రూపాయలు అప్పుగా ఇస్తారా? రేపు ఇస్తాను" అన్నాడు....

"సారీ....గురూ...." అన్నారు వాళ్ళు.

"సరే.... వెళ్ళొస్తా" అని నిలబడ్డాడు రాజన్.

"జాగ్రత్తగా వెళ్ళు గురూ....దాసుగాడ్ని పాడిచేసి నట్టు నిన్నుకూడా పాడుస్తారేమో" అన్నాడు ఒకడు.

"నన్నెవడురా పాడిచేది. ఇంతవరకూ పుట్టలేదు" అన్నాడు రాజన్. అతను మిగిలిన ఇద్దరిలాగా రాజుకీ,

రంగారావుకీ దొరకలేదు.

రోడ్డు చీకటిగా వుంది.

అది అసలే మురికి పేట యేరియా....అన్నీ కాలువలు-చిన్నచిన్న పాకలు.

బీడీ వెలిగించాడు. అగ్గిపుల్లను దూరంగా విసిరేశాడు.

ఆకాశంలో నక్షత్రాలు మెరుస్తున్నాయి.

ఓ మురికి కాలువ వెంబడే నడుస్తున్నాడు రాజన్. ఆతనికి మనసులో భయంగా వుంది తనని పోలీసులు పట్టుకుంటారేమోనని.

పోలీసులు తమకోసం వెతుకుతున్నట్టు అతనికి తెలుసు. అందుకే జాగ్రత్తగా తిరుగుతున్నాడు.

ఒకచోట కుక్క అరిచింది పెద్దగా....

"ఛస్" అరిచాడు రాజన్ విసుగ్గా....

చలిగా వుంది. మురికి కాలువలోనించి కంపుకొడుతోంది. అక్కడవున్న పాకలు విసిరేసిన మట్టిముద్దలా వున్నాయి.

చచ్చిపోయిన దాసు గురించే ఆలోచిస్తూ నడుస్తున్నాడు రాజన్.

కొంచెం దూరంలో రైలుపట్టాలు. పట్టాలకు దూరంలో ఎక్కడో వుంది రైలుగేటు.

రైలు కట్ట ఎక్కాడు రాజన్. రెండు పట్టాలకు మధ్యకు వచ్చి ఆగిపోయాడు. దూరంగా చీకట్లోకి చూశాడు. రైలు వస్తోంది. కాంతి కదలకుండా ముందుకు దూసుకు వస్తోంది.

ముందుకు కదలబోయాడు రాజన్

కాని కదల్లేకపోయాడు. ఎవరో గట్టిగా పట్టుకున్నట్టు

అనిపించింది. ఎంతో ప్రయత్నం చేశాడు. కాని కొంచెం కూడా కదల్లేకపోయాడు.

రాజన్‌కు ఆశ్చర్యం వేసింది. ఎవరో పట్టుకున్నారు తనని. గట్టిగా విదిలించాడు. అయినా అక్కడినించి కదల్లేకపోయాడు.

రైలు దగ్గరకు వచ్చింది.

అరిచాడు రాజన్ భయంతో.

అతని కేక రైలు చప్పుడుతో ఎవ్వరికీ వినిపించలేదు.

అతనిమీదకు దూసుకు వచ్చింది రైలు.

రాజన్ శరీరం ముక్కలయింది. శరీర అవయవాలు దూరంగా ఎక్కడో పడ్డాయి.

13

"మళ్ళీ ఏమయినా జరిగిందా?" అడిగాడు రాజు లోపలకు వచ్చిన ఇన్‌స్పెక్టర్‌ని చూసి.

"అవును. ఇంకొకడిని ఎవరో రైలుకిందకు నెట్టారు. తల చెక్కు చెదరలేదు. శరీరం నజ్జయింది."

"అతనో కాదో" అన్నాడు రాజు.

ఉదయం తొమ్మిది గంటలయింది.

"అందుకే నువ్వు ఒక్కసారి వచ్చి చూసి చెప్పు"

"అలాగే" అన్నాడు రాజు బయటకు వచ్చి గదికి తాళం పెట్టి.

రాజుకు ఈ హత్య అంతగా ఆశ్చర్యం కలిగించలేదు. రంగారావు ఎలాగయినా చంపుతాడని అతనికి తెలుసు.

పోలీసులను చూసి శివపాదంకూడా వచ్చాడు. ఆయన ఈ సంగతి విని రాజు మొహంలోకి చూశాడు.

"అన్నట్టు రాత్రి నువ్వు ఎక్కడున్నావ్?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"నేను, శివపాదంగారు, ఆయన కూతురు రెండో ఆట ఇంగ్లీషు సినిమాకు వెళ్ళాము" చెప్పాడు రాజు.

"సాక్ష్యం వుందా?"

"ముగ్గురికీ సాక్ష్యమా?" నవ్వాడు శివపాదం....

"అవును" అన్నాడు ఇన్‌స్పెక్టర్,

"ఇంటర్వెల్ తర్వాత రాజు థియేటర్లో సిగరెట్టు కాలుస్తుంటే పోలీసులు పట్టుకున్నారు. ఈ సాక్ష్యం చాలనుకుంటాను" అన్నాడు శివపాదం.

"సరే. వెడదాం" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"నే నొక్కడినే వెడతాను సార్. మీరెందుకు? డైరక్టుగా ఆఫీసుకు వస్తాను" అన్నాడు రాజు.

సరేనన్నాడు శివపాదం.

జీపులో బయిల్దేరాడు రాజు.

పది నిముషాల్లో జీపు రైలుపట్టాల దగ్గరకు చేరింది.

శవం ముక్కలన్నింటినీ ఒక్క చోటుకి చేర్చారు. మొహం మాత్రం అలాగే వుంది. సులభంగానే గుర్తు పట్టాడు రాజు.

"అవును. ఇతను ఆ ముగ్గురిలో ఒకడు" అన్నాడు.

14

భోజనం చేసి తన గదికి వచ్చేసరికి రాజుకోసం శివపాదం ఎదురు చూస్తున్నాడు. ఆయన చేతిలో న్యూస్ పేపరు వుంది.

"ఇదేమిటి ఇక్కడ కూర్చున్నారు?" అన్నాడు రాజు ఆశ్చర్యంగా....

"నీతో మాట్లాడాలి" అన్నాడు శివపాదం నవ్వుతూ.

"రండి" అంటూ తలుపులు తెరిచి లోపలకు నడిచాడు.

ఇద్దరూ కుర్చీల్లో కూర్చున్నారు.

"చెప్పండి"

"చెబుతాను. అయితే ప్రత్యేకంగా నేను చెప్పేదేమీ లేదు. అమ్మాయి నీతో అంతా చెప్పావన్నది. మీ పెళ్ళికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు."

ఒక్క నిముషం రాజు ఏమీ మాట్లాడలేదు.

తర్వాత "మీరు బాగా ఆలోచించారా?" అన్నాడు.

"అవసరంలేదు. నేను కస్తూరిని నాలాగే ఆలోచించ గలిగేట్టుగా పెంచాను. దాని నిర్ణయమే నా డెసిషన్" అన్నాడు శివపాదం.

"నా గురించి అన్ని విషయాలూ చెబుతాను.... నాకు తల్లి తండ్రీ ఇద్దరూ లేరు. కొంచెం పొలం వుంది. దాని మీద ఆదాయంతో ఇప్పటివరకూ పెరిగాను. పొలం వ్యవ హారమంతా నా మామయ్య చూసుకుంటాడు. అయితే నా పెళ్ళిగురించి ఆయనకు తెలియబరచవలసిన అవసరం ఎంతమాత్రమూ లేదు."

"థాంక్యూ రాజూ....మరి కట్నం—"

"ప్లీజ్....ఈ విషయం గురించి జోక్ చెయ్యకండి శివపాదంగారూ....కస్తూరే నాకు మీరిచ్చే కట్నం" అన్నాడు రాజు.

"థాంక్స్.... వెళ్లొస్తాను....అన్నట్టు మరిచాను. నువ్వు ఇంతకు ముందు ఏదో, లాటరీ టిక్కెట్టు కొన్నానన్నావు గదా! ఇదిగో. ఈ పేపర్లో ఏవో లాటరీ డ్రా రిజల్ట్సు వేశారు. చూడు" అంటూ పేపర్ని ఇచ్చాడు శివపాదం.

చూశాడు రాజు. అతను కొన్న టిక్కెట్టు డ్రా ఫలి తాలే అవి.

గబగబా సూట్కేసు తెరిచి, అందులోనించి టిక్కెట్టు తీసుకొచ్చి నెంబరు చూశాడు.

పేపర్లో మొదటే వుంది ఆ నెంబరు. సరిగ్గా అదే. సంతోషంతో పెద్దగా అరిచాడు రాజు. గుండెలు పగిలి పోతాయేమో ననిపించింది.

"నాలుగు లక్షలు....ఫోర్ లాక్స్....చార్ లాక్" అంటూ గట్టిగా అరిచాడు.

"నిజంగానా రాజూ" అన్నాడు శివపాదం అయోమయంగా.

"అవును. మీరే చూడండి" అంటూ ఆ టిక్కెట్టును ఆయనకు ఇచ్చాడు.

ఆయనకూడా చూశాడు. అవును. అదే నంబర్‌కు నాలుగు లక్షల బహుమతి వచ్చింది.

"యూ ఆర్ లక్కీ రాజూ....నువ్వు అదృష్టవంతుడివి" అన్నాడు శివపాదం—రాజు భుజం తడుతూ.

"నేనుకాదు....కస్తూరి అదృష్టవంతురాలు" అన్నాడు రాజు.

15

రాజు పెళ్ళియింకా పన్నెండు రోజులు వుంది. పెళ్ళి నిశ్చయమయిన తర్వాత రాజు కస్తూరితో కలిసి ఏమాత్రం టైము దొరికినా తిరుగుతున్నాడు.

"నిజంగా నేను అదృష్టవంతురాలిని రాజా!" అంది కస్తూరి.

"కాదు నేను" అన్నాడు రాజు.

"కాదు నేను" అన్నది కస్తూరి.

"నేను."

"నేను."

"కాదు. ఇద్దరం" అన్నాడు రాజు.

"నిజం. అలా ఒప్పుకో" అన్నది నవ్వుతూ.

"నీకు ఎలాంటి నగలు చేయించమంటావ్?"

"నువ్వూ-నీ ప్రేమ వుండగా నాకు నగలెందుకు రాజూ!"

"అలా కాదు కస్తూరీ. ఏం కావాలో చెప్పు!"

"నీ ఇష్టం" అన్నది.

ఆ రోజు కస్తూరి సెలక్షన్ మీద రాజు మూడు రకాల గొలుసులను కొన్నాడు. వాటిలో కస్తూరి అతని కళ్ళకు మరింత అందంగా కనబడింది.

"బ్యూటిఫుల్" అన్నాడు రాజు.

అతనికి ఒకందుకు ఎంతో విచారంగా వుంది. రంగారావు వుంటే తన అదృష్టానికి అతను ఎంతగానో సంతోషించేవాడు. అయినా ఫరవాలేదు. రంగారావు అనుక్షణం తన వెంటే వుంటున్నాడు. అతను తన నీడ. తన రక్షకుడు, 'నీకు జన్మ జన్మలకూ ఋణపడి వుంటాను ఫ్రెండ్' కృతజ్ఞత చెప్పుకున్నాడు రాజు అనేకసార్లు మనసులోనే.

శుభలేఖలు అచ్చయ్యాయి.

రాజు ఒక శుభలేఖ రంగారావు పేర వ్రాసి, "ఫ్రెండ్! మా పెళ్ళికి నువ్వు తప్పక రావాలి" అన్నాడు శూన్యంలోకి చూస్తూ.

శివపాదం తన వాళ్ళందంకీ శుభలేఖలను పోస్టు చేశాడు. అతని ఆఫీసువాళ్ళందరూ శివపాదాన్ని ఎంతో పొగిడారు లక్షాధికారి రాజు ఆయన అల్లుడవుతున్నందుకు.

రాజు తనకు ఓ స్కూటర్ కొన్నాడు. ఇప్పుడు అతను కస్తూరిని వెనుక ఎక్కించుకుని షికార్లు కొడుతున్నాడు.

16

సుందరం నల్లగా పొట్టిగా చైనావాడిలా వుంటాడు. అతనికి తన స్నేహితు లిద్దరూ వరుసగా చచ్చిపోవడంతో భయ మేసిపోయింది.

తన ఇంట్లోనించి బయటకు రాకుండా గడుపుతు న్నాడు. ఎంతో అవసరముంటే నేగానీ రావటంలేదు. పగటి పూట అప్పుడప్పుడు వేషం మార్చుకుని తిరుగు తున్నాడు.

తన కోసం కూడా పోలీసులు వెతుకుతున్నారని అత నికి తెలుసు.

కాని ఒక్క మనిషి ఇంత ధయిర్యంగా ఇద్దరిని చంపా డంటే అంత నమ్మశక్యంగాలేదు.

ఒక్కడిని ముగ్గురూ కలిసే చంపేశారు. ఇక మిగి లింది ఒక్కడు. వాడొక్కడే అందరినీ చంపుతున్నాడా?

సుందరంకి విసుగు పుట్టింది. ఎన్నాళ్ళిలా పిరికివాడిలా ఇంట్లో కూర్చుని గోళ్లు గిల్లుకోవడం? బయటకు వెళ్ళాలి. తన పని తను చెయ్యాలి. రోజులు గడవటం కష్టంగా వుంది అనుకున్నాడు సుందరం. ఆ రోజు రెండో ఆట సినిమాకు వెళదామనుకున్నాడు. రాత్రి తొమ్మిది గంట లకు బయటకు వచ్చాడు. రోడ్లు ఇంకా రద్దీగానే వున్నాయి. కొద్దిగా వేషాన్ని మార్చుకున్నాడు.

రోడ్డుమీద నడుస్తూ వాల్ పోస్టర్లను చూస్తున్నాడు సుందరం. ఏ సినిమాకు వెళ్ళాలో తేల్చుకుంటున్నాడు.

ఒకచోట ఆగిపోయాడు. మంచి ఫైటింగ్ వున్న హిందీ సినిమా వాల్ పోస్టరు కనిపించింది.

ఆ సినిమాకు వెడదామనుకొన్నాడు సుందరం. ఆ థియేటరు అక్కడకు దగ్గరే.

రోడ్డు వారగా వున్న కిళ్ళీ బంకులో అరప్యాకెట్టు చార్మినార్ సిగరెట్లు కొన్నాడు.

ఒకటి వెలిగించి నడచుకుంటూ థియేటర్ దగ్గరకు వెళ్ళాడు.

అప్పుడే మొదటి ఆట వదిలారు.

అది అప్‌స్టెయిర్ థియేటర్. పావుగంట తర్వాత రెండో ఆట సినిమాకు టిక్కెట్లు ఇచ్చారు. టిక్కెట్టు తీసుకుని పైకి వెళ్ళాడు.

లోపలకు వెళ్ళి కూర్చున్నాడు.

సినిమా ఇంకా మొదలు కాలేదు. పాటలు వేస్తున్నారు. గేట్లోనించి లోపలకు వస్తున్న మనుషులను పరిశీలనగా చూస్తున్నాడు సుందరం.

అతనికి గేట్లోనించి బయటకు వెడుతున్న రాజు కనిపించాడు.

ఆ సినిమాకు రాజు-కస్తూరి వచ్చారు. రాజు సిగరెట్ల కోసం కిందకు వెళుతున్నాడు.

రాజును చూడగానే సుందరంలో పగ బుసలు కొట్టింది.

వీడే తన స్నేహితు లిద్దరనీ చంపింది. ఇప్పుడు దొరికాడు. వీడి అంతు చూడాలి.

చటుక్కున లేచి బయటకు వెళ్ళాడు సుందరం. రాజు మెట్లు దిగుతున్నాడు.

అతని వెనక్కు వెళ్ళబోయాడు. ఇంతలోనే అతను ఎవరో పట్టి లేపినట్లు గాల్లోకి లేచాడు.

పెద్దగా అరచాడు సుందరం.

మెట్లు దిగుతున్న రాజు ఆ అరుపు విని వెనక్కు వచ్చాడు.

అప్పటికే సుందరం అందరూ చూస్తూండగా బాల్కనీ గోడమీదనించి కిందపడ్డాడు.

పడటంతోటే అతని తల చితికిపోయింది. నిమిషంలో అతని చుట్టూ మనుషులు పోగయ్యారు.

సుందరం పైకి లేచినప్పుడే రాజు అతన్ని గుర్తుపట్టాడు.

అతను కింద పడగానే గబగబా వచ్చి "వెళ్ళిపోదాం" అని కస్తూరిని తీసుకుని బయటకు వచ్చాడు.

కస్తూరికి ఏమీ అర్థం కాలేదు.

17

ఇక రెండు రోజులే వుంది పెళ్ళి.

శివపాదం పెళ్ళి ఏర్పాట్లు భారీ ఎత్తున చేస్తున్నాడు.

ఊళ్ళో వున్న స్నేహితులందరినీ రాజు-కస్తూరి వెళ్ళి పిలవదల్చుకున్నారు.

"స్కూటర్ తీసుకురా" అన్నది కస్తూరి.

"దాన్లో పెట్రోలు తక్కువగా వుంది. ఐనా ఓ టాక్సీ తీసుకువెడదాం" అన్నాడు రాజు.

అతనికి ఎంతో సంతోషంగా వుంది.

వెడ్డింగ్ కార్డ్సు తీసుకొని బయటకు వచ్చారు.

"త్వరగా రండి" అన్నాడు శివపాదం బయటకు వచ్చి.

"అలాగే" అన్నాడు రాజు.

వాళ్ళకు రోడ్డుమీదే ఓ టాక్సీ ఎదురయ్యింది. డ్రయివర్‌తో మాట్లాడి ఇద్దరూ ఎక్కారు.

టాక్సీ వెళుతోంది.

"మనం చాలా తమాషాగా కలుసుకున్నాం రాజూ!" అన్నది కస్తూరి.

"అవును. మేరేజస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్" అన్నాడు రాజు కస్తూరి కళ్ళలోకి చూస్తూ.

"ఆ రోజు ఆ సంఘటన జరక్కుండా వుంటే నువ్వెవరివో?"

"పోయిన ఆ ముగ్గురు రౌడీ వెధవలకీ మనం ఎంత గానో ఋణపడి వున్నాం" అన్నాడు రాజు.

టాక్సీ ఓ యింటి ముందు ఆగింది.

దిగి లోపలికి వెళ్ళారు. ఆ ఇంట్లో కస్తూరి స్నేహితు రాలు వుంటోంది. ఆ అమ్మాయి ఇంట్లోనే వుంది.

గర్వంగా రాజుని ఆ అమ్మాయికి పరిచయం చేసింది కస్తూరి. తర్వాత శుభలేఖ ఇచ్చి ఇన్వయిట్ చేసింది. ఐదు నిముషాల తర్వాత ఇద్దరూ వచ్చి టాక్సీలో ఎక్కారు. మళ్ళీ ముందుకు కదిలింది టాక్సీ.

"చాలామందికి జెలసీగా వుంది మనిద్దరం పెళ్ళి చేసుకోవడం" అన్నది కస్తూరి.

నవ్వేడు రాజు.

ఉన్నట్టుండి అతని షర్టు జేబులో వున్న పెన్ను పైకి లేచింది.

గబుక్కున ఓ కాయితాన్ని బయటకు తీశాడు రాజు. అతనికి తెలుసు రంగారావు ఏదో రాయబోతున్నాడని.

కస్తూరి చిత్రంగా చూస్తోంది.

పెన్ను రాస్తోంది. చదువుతున్నాడు రాజు.

"రాజూ! వాళ్ళు ముగ్గురూ నన్ను వశపర్చుకున్నారు. నిన్ను ఇక రక్షించలేను. వాళ్ళు నిన్ను బతకనివ్వరు.... నిన్నిక భగవంతుడే కాపాడాలి."

రాజుకు చెమటలు పట్టాయి.

కస్తూరి భయంగా అతని మొహంలోకి చూసింది.

"భయపడకు కస్తూరీ" అన్నాడు రాజు వణికిపోతూ.

బ్రిడ్జిమీదనించి వెళుతోంది టాక్సీ.

"డ్రయివర్, టాక్సీ ఆపు" అరిచాడు రాజు.

కాని టాక్సీ ఆగలేదు. డ్రయివర్ మాట్లాడలేదు.

అరుస్తున్నాడు రాజు!

టాక్సీ వేగంగా వెళుతోంది. రాజు అరుపులకు పక్కనించి వెళుతున్నవాళ్ళు ఆశ్చర్యంగా చూస్తున్నారు.

ఉన్నట్టుండి టాక్సీ పక్కకు తిరిగింది.

కెవ్వున కేక పెట్టింది కస్తూరి.

టాక్సీ బ్రిడ్జిగోడకు డాష్ ఇచ్చి ఎగిరికిందకు పడిపోయింది.

జనం బ్రిడ్జి క్రిందకు పరిగెత్తుతున్నారు.

—ఐపోయింది—